# రక్తపుమరక



"నిన్న సాయంత్రం మా ఆవిణ్ణి పరీక్షించారట. నన్ను ఆస్పత్రికి రమ్మన్నారట. కాని, రాత్రి నేను ఆఫీసునుండి వచ్చేసరికి ఎనిమిది గంటలు దాటింది. అందుచేత రాలేకపోయాను" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆమెకు బ్లడ్ ప్రెషర్ చాలా తీవ్రంగా ఉన్నది. ఇదివరకు నేను చెప్పిన మందు పని చేసినట్టు కనుపించలేదు. ఇప్పుడు కొన్ని మాత్రలు వ్రాసిఇస్తాను. సీసా బహుశా ఆరు రూపాయలుంటుంది. ఆ మాత్రలు పూటకి ఒకటి చొప్పున వాడండి. ఆమెకు స్వస్థత చిక్కిన వెంటనే వాటిని వాడడం నిలుపుచేయండి. అవి చాలా ప్రమాదమైనవి. ఎక్కువగా వాడితే మరణం కూడా సంభవించవచ్చును. అసలు మీబోటి నా బోటి మనుష్యులే ఒక అరడజను మాత్రలు వేసుకొంటే తప్పక మరణిస్తాము. కాబట్టి జాగ్రత్త అని ఇంకొకసారి హెచ్చరిస్తున్నాను. రాత్రి ఆమెకు నిద్రపట్టిందా?" అన్నాడు డాక్టరు.

"లేదండి. తెల్లవారన్నా మూలుగుతూనే

**మంచి చేసినా, చెడు చేసినా దాని ప్రభావం అంతో ఇంతో మనిషిని అంటి పెట్టుకొని ఉంటుంది. తెలిసి చేసిన దాని ప్రభావం మరీ అధికం. చెడు అయితే ఒకరితో చెప్పుకొనే అవకాశం కొన్ని సందర్భాలలో శూన్యమే కనుక ఆ బాధ నుంచి తప్పించుకొనడానికి మార్గం గోచరించదు. నరకం అంటే అదే కావచ్చు.**

ఉంది. ఉదయం అలా మూలుగుతూనే లేచి మూకెంత కాఫీ చేసింది. ఆ తరువాత ఎలాగో వంట కూడా చేసిపెట్టింది" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆమెకు పూర్తిగా విశ్రాంతి కావాలి. వంటలూ, వార్పులూ చేయడానికి వీలులేదు. ఎన్ని మందులు వాడినా విశ్రాంతి లేకపోతే అవి పని చేయవు. మానసికంగా కూడా ఆమెకు బాగా విశ్రాంతి కలగాలి. ఆమెకు ఉద్రేకంగాని, ఆవేశం గాని కలగకూడదు. రెండు రోజులు పోయాక ఎలా ఉన్నదీ నాతో చెప్పండి. అవసరమయితే నేను ఇంకొకసారి చూస్తాను. ఇక మీరు వెళ్ళవచ్చును" అన్నాడు డాక్టరు.

కృష్ణమూర్తి లేచాడు. డాక్టరుగారికి పది రూపాయల నోటు తీసి ఇచ్చాడు. ఒక నమస్కారం చేసి తిరిగివచ్చాడు.

ఇటువంటి పది రూపాయల నోట్లు ఆ డాక్టరుగారికి కృష్ణమూర్తి ఇదివరకు చాలా ఇచ్చాడు. అయితే అందులో ఎక్కువ భాగం తన తండ్రి గురించే ఇచ్చాడు. కృష్ణమూర్తి భార్య రవణమ్మకు ఈ బ్లడ్ ప్రెషర్ కొద్దికాలం క్రిందటే ప్రవేశించింది. అంతవరకు పాపం ఆమె అనారోగ్యం ఎరగదు. ఇంటెడు పనీ తనే చేసేది. కృష్ణమూర్తి తెచ్చే స్వల్పమైన జీతాన్ని నెలాఖరువరకూ సరిపోయేటట్లు చూచేది. కానీ, ఏమిటి లాభం? తండ్రికి కనీసం నెలకు మూడు సార్లు అనారోగ్యం చేస్తూ ఉండేది. దానితో అతనికి మందులూ, మాకులూ, పళ్ళరసాలూ, గ్లూకోజు డబ్బాలూ—వీటితో కృష్ణమూర్తికి రోజు రోజుకూ ఋణం పెరిగిపోతూంది. ఇప్పుడు రవణమ్మ కూడా ఒక రోగిలాగు కూర్చుంది. పైగా కొడుకు రామారావు హైస్కూల్లో చదువుతున్నాడు. కృష్ణమూర్తి అలాగే క్రిందా మీదా పడుతూ వస్తున్నాడు.

కృష్ణమూర్తి తండ్రి రామయ్య. డెబ్బయి అయిదు సంవత్సరాల వయస్సు ఉంటుంది, భగవంతుడు అతనికి ఆయుస్సు ఇచ్చాడే కాని ఐశ్వర్యం ఇవ్వలేదు. అతడు కని పెంచిన సంతానంలో కృష్ణమూర్తి ఒక్కడే మిగిలాడు. రామయ్య భార్య ఏనాడో మరణించింది. వార్ధక్యంలో రామయ్య కృష్ణమూర్తి ఒక్కడిపైనే ఆధారపడవలసివచ్చింది. కృష్ణమూర్తి తండ్రిని అభిమానంగా చూచేవాడు. రవణమ్మ కూడా మామగారిని బాగానే చూచేదని చెప్పాలి. కాని రామయ్య తన కోడల్ని ఎప్పుడూ నిజమైన అభిమానంతో చూడలేకపోయేవాడు. ఏమాత్రం అవకాశం కలిగినా అతడు రవణమ్మతో కయ్యానికి కాలు దువ్వుతూనే ఉండేవాడు. ఋణభారం పెరిగి

# రక్తపు మరక

పోతున్నదనే మనోభారంతో క్రుంగిపోతున్న కృష్ణమూర్తికి వీరిద్దరి పోట్లాట ఎంతో బాధ కలిగించేది.

రామయ్యకు జ్వరం వచ్చినప్పుడు చాలా గొడవ చేసేవాడు. పాటలు పాడేవాడు. అనేక మైన భాషలు మాట్లాడేవాడు. తను మరణిస్తున్నానని అందరికీ చెప్పేవాడు. ముఖ్యంగా రవణమ్మను నానా మాటలూ అనేవాడు. రామయ్య మాటలూ చేష్టలూ తనను బాధిస్తున్నా రవణమ్మ తిరిగి ఒక్క మాట అనేది కాదు. కాని అతనికి జ్వరం వచ్చినప్పుడు ఏమన్నప్పటికీ ఆమె సహించేది. ఈ జ్వరమే తగ్గకపోతే, దీనితో ఈ ముసలివాడు చనిపోతాడేమో అనే భయమే ఆమె సహించడానికి కారణం కావచ్చును. కాని అది ఆశ నిరాశ అయ్యేది. రామయ్యకు జ్వరం వచ్చినప్పుడు వెయ్యాలసిందిగా డాక్టరు కొన్ని మాత్రలు వారింటనుంచి ఎప్పుడూ ఉంచేవాడు. మూడు రోజులు జ్వరంతో బాధపడ్డ రామయ్య ఆ మాత్రల ప్రభావంవల్ల నాలుగవ రోజు యథాప్రకారం లేచి కూర్చునేవాడు.

• • •

కృష్ణమూర్తి ఆఫీసుకు వెళ్ళుతున్నప్పుడే డాక్టరు చెప్పిన మాత్రలు కొని జేబులో వేసుకొన్నాడు. అతడి మనస్సేమీ బాగులేదు. ఆఫీసులో కూర్చున్నంతసేపూ తన పరిస్థితి గురించే అతనికి ఆలోచనలు కలిగాయి. ఎంతకాలమని ఈ విధంగా సంసారాన్ని లాగగలడు? ఇప్పటికి తనకు ఏభయి ఏళ్ళు వచ్చాయి. రవణమ్మకు కూడా నలభయి ఏళ్ళు దాటాయి. ఇన్ని రోజులు ఉద్యోగం చేసినా తను ఒక మంచి బట్ట కొనుక్కోలేదు. పదిహేను రూపాయల ఖరీదు చేసే చీర రవణమ్మకు తను ఎప్పుడూ కొనలేదు. మంచి భోజనం, ఫలహారం తాను ఎప్పుడూ నోచుకోలేదు. ఇంట్లో ఎవరికీ శుభ్రమైన పరుపుగాని, మంచంగాని లేదు. ఉన్న ఒక్క మంచమూ అతడి తండ్రి వాడుతున్నాడు. మట్టిలో పుట్టి, మట్టిని తింటూ, తిరిగి మట్టిలో కలవబోతున్నది తన జీవితమూ, రవణమ్మ జీవితమూను. కొడుకు రామారావును అతి కష్టంమీద చదివిస్తున్నాడు. కాని, ఇంకా చదువు పూర్తికావడం ఎప్పుడు? ఉద్యోగం

## న్యాయపతి జగనోహన్

చేయడం ఎప్పుడు? అతనిక్కడ సంపాదించడం ఎప్పుడు?

వార్ధక్యమైనా ఒక సుఖం అయినా ఉండాలి అనుకున్నాడు కృష్ణమూర్తి. తన తండ్రి ఇంకా బతికి సాధించేదేమిటి? ముసలితనం—దానికి రోగాలు తోడయి కాటికెళ్ళే వయసులో ఉన్నాడు. ఇంట్లో తనకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాడు. ఆ ముసలివాడి వల్ల తమ కుటుంబం చాలా వ్యగ్రతకు గురి అయింది. ఈ ఖర్చులన్నీ ఎవరైనా రానిస్తారా? అతని రాత్రి త్వరగా ఇదిగిరే అయితే ఎంతో ఉపకారం చేసినవారవుతారు. కాని, ఏ విధంగానూ ఆయనను పంపించడం సాధ్యం కాదు. ఈ విషయంలో కూడా ఆలోచించడం కృష్ణమూర్తి తనలో తనే సిగ్గుపడ్డాడు.

కృష్ణమూర్తి ఆఫీసు వదిలేసరికి యథాప్రకారం రాత్రి ఏడు గంటలైంది. అతడు ఇంటికి పది మైళ్ళ దూరంలో ఉంటాడు. ఆఫీసు వదిలినప్పుడు బస్సులో వెళ్ళి ఇంటికి కాలి నడకనే చేరుకుంటాడు. అలా అతడు కొంత డబ్బు ఆదా చేసుకుంటాడు. ఆ డబ్బు మిగిల్చినప్పుడు సామాను కొంటాడు. రెండువందల రూపాయల జీతంతో ఆ ఇల్లు గడవడం కష్టంగా ఉంది. అతడి జీవితం అలాగే గడుస్తూ ఉంది.

కృష్ణమూర్తి ఇల్లు చేరేసరికి చీకటి పడ్డది. వీధి తలుపు తెరిచే ఉన్నది. అతడు తలుపు తీసుకొని లోనికి వెళ్ళాడు. తండ్రికి మళ్ళీ జ్వరం వచ్చినట్టుంది. ఆ మైకంలోనే అతడు రవణమ్మను నానా మాటలూ అంటున్నాడు. కృష్ణమూర్తి తిన్నగా అల్మారా దగ్గరకు వెళ్ళాడు. వెతికి అగ్గిపెట్టె తీశాడు. కొవ్వొత్తి వెలిగించాడు.

రవణమ్మ మంచంమీద పడుకొని ఉన్నది. భర్త రావడం చూచి ఆమె లేవబోయింది. కాని, ఒక్కసారి తల తిరగడం వల్ల ఆమె తిరిగి పడిపోయింది.

"లేవకు, లేవకు. బ్లడ్ ప్రెషర్ ఎక్కువగా ఉన్నట్టుందే?" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆ ముసలాయన నోరు ఎందుకు ఎలా తిడుతున్నారో వింటున్నారా? ఈ పోరుకుండే నాకు ఈ కుదరని రోగం పట్టుకొస్తున్నది. నేను చచ్చిపోతే గాని మీ తండ్రికి తృప్తి ఉండదు" అన్నది రవణమ్మ కళ్ళు తుడుచుకుంటూ.

"ఇది ఎప్పుడూ ఉన్నదే! దాని గురించి అంతగా పట్టించుకోకు. ఈ రోజు మంచి మాత్రలు తీసుకొచ్చాను. వీటితో నీకు తప్పక నయమౌతుంది" అంటూ కృష్ణమూర్తి అల్మారాలో మాత్రల సీసా పెట్టాడు. తడిబట్టలు విప్పాడు.

"నాయనా, కృష్ణా!" అంటూ రామయ్య పిలిచాడు.

"మళ్ళా జ్వరం వచ్చిందా?" అంటూ కృష్ణమూర్తి అతడివద్దకు వెళ్ళాడు.

"నేను ఎలా ఛస్తే ఎవరికి కావాలి! నాలుగ్గంటలకు వచ్చింది జ్వరం. ఇంతవరకు నేను ఒక కప్పు కాఫీకి నోచుకోలేదు. ఆ కుర్ర వెధవ ఇల్లు పట్టడు. ఈ అమ్మగారు ముసుగు తన్ని వెచ్చగా పడుకొంటుంది" అన్నారు రామయ్య.

"దానికి బ్లడ్ ప్రెషర్ తీవ్రంగా ఉన్నది. ఈ పూట బహుశా వంటకూడా చేయలేదేమో? నేనే కాఫీ చేసి ఇస్తాలెండి" అన్నాడు కృష్ణమూర్తి.

"నా కిప్పుడు కాఫీ అక్కరలేదు. నా జ్వరం మాత్రలు ఉన్నాయా? ఉంటే రెండు పడెయ్యి. అయినా డబ్బున్న వాళ్ళలాగ మాటి మాటికీ బ్లడ్ ప్రెషర్ అని పడుకుంటే మనవంటివాళ్ళకి ఎలా సాగుతుంది? ఏదో లేవాలి. నాలుగు పనులూ చేసుకోవాలి. ఇంతకీ దానిని అనడం ఎందుకులే! రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ళతో పరుగెత్తిందట" అన్నాడు రామయ్య.

'ఛీ, ఛీ! ఏమి మనిషి!' అనుకున్నాడు కృష్ణమూర్తి. తండ్రి మాటలు అతడికి రోత పుట్టించాయి. అతడికి తండ్రిపై ఎక్కడలేని కోపం వచ్చింది. అప్రయత్నంగానే అల్మారావద్దకు వెళ్ళాడు.

అయిదు నిమిషాలు పోయాక తిరిగివచ్చాడు కృష్ణమూర్తి.

"నోరు తెరవండి" అని తండ్రి నోటిలో రెండు మాత్రలు వేశాడు.

కృష్ణమూర్తి వెళ్ళి ఈజీఛైరులో కూర్చున్నాడు. అతడికి కొంతసేపటివరకూ, తల పని చేయలేదు. ఏమిటాలోచిస్తున్నాడో తనకే తెలియలేదు. విద్యుద్దీపాలు తిరిగి ఎప్పుడు వెలిగాయో అతడు గమనించనేలేదు. కొంతసేపటికి రామారావు ప్రైవేటునుండి తిరిగి వచ్చాడు. అన్నం పెట్టమని తల్లి నడుగుతున్నాడు. కృష్ణమూర్తి తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు.

"ఈ పూట నేను వండలేదురా, బాబూ! కారేజి తీసుకొనివెళ్ళి నీకూ మీ నాన్నగారికీ అన్నం తీసుకొనిరా" అంటున్నది రవణమ్మ.

"నా కేమీ అవసరంలేదు. నువ్వే ఆ హోటల్లో తినిరా" అన్నాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి తెచ్చిన బ్లడ్‌ప్రెషర్ మాత్ర ఒకటి వేసుకొని పడుకొన్నది రవణమ్మ.

కృష్ణమూర్తి లేచాడు. కాఫీచేసి తను కొంత తాగాడు. తండ్రిని లేపి కొంత ఇచ్చాడు. హోటలుకు వెళ్ళిన రామారావు తిరిగివచ్చి పడుకొన్నాడు. కృష్ణమూర్తికి నిద్ర రాలేదు. అతడు లేచి ఇల్లంతా పచార్లు చేయడం ప్రారంభించాడు. ఇంతవరకూ అణగారిన ఏదో మనఃప్రవృత్తి అతడిలో విజృంభించింది. ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు. రాత్రి పన్నెండు గంటలు కొట్టాక తండ్రి నింకొకసారి లేపి రెండవ మోతాదు మాత్రలు ఇచ్చాడు. నిద్రలోనే రామయ్య నోరు విప్పాడు. ఆ తరువాత కూడా చాలాసేపటివరకూ కృష్ణమూర్తి పచార్లు చేస్తూనే ఉన్నాడు.

* * *


కృష్ణమూర్తి ఉదయాన్నే లేచాడు. తండ్రి వద్దకు వెళ్ళాడు. లేపగా, లేపగా తండ్రి బలవంతాన కళ్ళు విప్పాడు.

"ఎలాగున్నది ఒంట్లో?" అని కృష్ణమూర్తి అడిగాడు.

"చాలా నీరసంగా ఉన్నది, బాబూ! ఏదో అగాధంలో పడిపోతున్నట్లు అనిపిస్తోంది" అన్నాడు రామయ్య.

"ఈ రెండు మాత్రలు వేసుకోండి. పూర్తిగా తగ్గిపోతుంది" అంటూ కృష్ణమూర్తి అతడి నోట్లో ఇంకొక రెండు మాత్రలు వేశాడు.

రవణమ్మకు ఆ ఉదయం కాస్త సులువుగానే ఉన్నది. పైగా ఆ రోజు ఆఫీసుకు సెలవు. అయి



హరిణద్వయం

చిత్రం—పి. పుష్పలత (హైదరాబాదు)

నప్పటికి రాత్రి ఎవరికీ భోజనాలు లేకపోవడం నుంచి కృష్ణమూర్తి తనే ఉదయాన వంట చేశాడు. పది గంటలకు ముగ్గురూ భోజనాలు పూర్తి చేశారు.

చేయి తుడుచుకుంటూ కృష్ణమూర్తి రామయ్యవద్దకు వెళ్ళాడు. రామయ్య శరీరం కలువకాడలా ఉన్నది. అతడు ఊపిరి కూడా పీలుస్తున్నట్టు లేదు.

"రామం! త్వరగా వెళ్ళి డాక్టరుగారిని పిల్చుకురా. తాతగారికి చాలా ప్రమాదంగా ఉంది" అని కృష్ణమూర్తి గట్టిగా అరిచాడు.

డాక్టరు వచ్చాడు. రామయ్యను పరీక్షించాడు.

"ఈయన మరణించి అప్పుడే ఒక గంట కావస్తోంది" అన్నాడు. అందరూ గొల్లున ఏడ్చారు.

"ఏం జరిగింది?" అన్నాడు డాక్టరు.

"ఎప్పట్లాగే నిన్న జ్వరం వచ్చిందండి. ఎప్పట్లాగే మూడు పూటలా మాత్రలు ఇచ్చాను. ఉదయానికి తగ్గినట్టే కన్పించింది కూడా. ఇప్పుడే భోజనం చేసి వచ్చి చూచేసరికి ఇలా ఉన్నారు" అన్నాడు కృష్ణమూర్తి దుఃఖం ఆపుకుంటూ.

తండ్రి అంత్యక్రియలు కృష్ణమూర్తి బాగా జరిపించాడనే అందరూ చెప్పుకున్నారు. తండ్రి మరణించాక కృష్ణమూర్తిలో కొంత మార్పు వచ్చింది. అతడు అందరితో చాలా ముభావంగా ఉంటూవచ్చాడు. అతని మొహంలో ఎప్పుడూ విచారం కనపడేది.

కాని ఇతర విషయాలలో కృష్ణమూర్తి పరిస్థితి చాలా మెరుగైంది. మొట్టమొదటిసారిగా ఇంట్లో కలతలు సమసిపోయాయి. రవణమ్మకు క్రమంగా స్వస్థత కలిగింది. కొన్నాళ్ళకు ఆమె ఇంచుమించు మునుపటి మనిషి అయింది. కృష్ణమూర్తికి డబ్బు ఒత్తిడి తగ్గింది. కొన్ని సంవత్సరాలు సాఫీగా గడిచిపోయాయి. రామారావు పెద్దవాడయ్యాడు. ఎల్‌ఎల్. బి. చదువుతున్నాడు. కృష్ణమూర్తికి ఉద్యోగంలో ప్రమోషన్ కూడా వచ్చింది. రామారావుకు బాగా కట్నమిచ్చిన సంబంధం ఒకటి కుదిరింది. పెళ్ళయింది. కోడలు సీతాలక్ష్మి ఇంటికి వచ్చింది.

తండ్రి చనిపోయిన ఏడేళ్ళకు కృష్ణమూర్తి ఉద్యోగంలోంచి రిటైరయ్యాడు. ఇంటి భారం కొడుక్కు, కోడలికి అప్పగించి అతడు, రవణమ్మ తీర్థయాత్రలు సేవించి వచ్చారు. వాళ్ళు తిరిగి వచ్చిన రోజే రవణమ్మకు జ్వరం వచ్చింది. ప్రయాణపు బడలికనుంచి అని అందరూ అనుకొన్నారు. కాని రవణమ్మ మూసిన కన్ను తెరవ

లేదు. జ్వరంవచ్చిన మూడో రోజునే అను కోకుండా ఆమె ఈ లోకంనుండి నిష్క్రమించింది.

భార్య చనిపోవడంతో కృష్ణమూర్తి పూర్తిగా మారిపోయాడు. అతనికి ఏదో తగని భయం పట్టుకొన్నది. బెంగతో చిక్కి శల్యమైనాడు. రాత్రులు అతనికి భయంకరమైన కలలు వచ్చేవి. పెద్ద కేకలు వేస్తూ లేచేవాడు. ముచ్చెమటలు పోసేవి. పైగా అతనికి ప్రతి విషయంలోనూ ఏదో ఒక అనుమానం కలుగుతూండేది. ఎవ రైనా నలుగురు మాట్లాడుకొంటూంటే తన గురించే చెప్పుకుంటున్నారని అపోహ పడేవాడు. కొడుకూ, కోడలూ మాట్లాడుకుంటున్నప్పుడు కూడా పొంచి పొంచి వినేవాడు. సీతాలక్ష్మి వండుతున్నప్పుడు నిశ్శబ్దంగా వెనకనుంచి వెళ్ళి ఆమె ఏమి చేస్తున్నదీ గమనించేవాడు. ఒకటి రెండుసార్లు దొరికిపోయాడు కూడా. దానితో కొంత గొడవ జరిగింది.

రమణమ్మ గతించి ఆరు నెలలు కావస్తూంది. ఒక రోజు అతడు స్నానంచేసి వచ్చేసరికి అతడి పెట్టె, పరుపు వగైరాలు సీతాలక్ష్మి, రామారావు ఎక్కడికో మార్చేస్తున్నారు.

"ఏమిటిది?" అన్నాడు తెల్లబోయి.

"తాతగారి గది ఈ రోజునుండి మీరుఉపయో గించండి. అది ఖాళీగా ఉంది. ఈ గదిలో నాలుగు కుర్చీలూ అవీ వేసి నా ఆఫీసు గదిగా ఉపయో గిస్తాను" అన్నాడు రామారావు.

"కనీసం నాతో చెప్పవద్దా?" అన్నాడు కృష్ణ మూర్తి.

"మీ రెలాగూ సమ్మతిస్తారని నాకు తెలుసు. నేను స్వతంత్రంగా ప్రాక్టీసు ప్రారంభించి సంవత్సరం కావస్తోంది. ఇంతవరకూ నాకు ఆఫీసు గదంటూ ఒకటి లేదు. ఏ హంగులూ లేవు. కాస్త అట్టహాసంగా కనిపించాలి. కాలంతో పాటు మనమూ మారాలి" అన్నాడు రామారావు.

'అవును. కాలంతోపాటు మనమూ మారాలి' అనుకున్నాడు కృష్ణమూర్తి. ఇంతవరకూ తను ఈ ఇంటికి యజమాని. ఇప్పుడు రామారావు. ఇదివరకు రంగస్థలంపైన తనే ప్రధాన భూమిక వహించాడు. ఆ రంగస్థలంపైన ఇప్పుడు తనకు తావులేదు. ఇదివరకు 'రామారావు కేరాఫ్ కృష్ణ మూర్తి' అంటూ అబ్బాయి పేర ఉత్తరాలు వచ్చేవి. ఇప్పుడు 'కృష్ణమూర్తి కేరాఫ్ రామారావు' అంటూ తనకు వచ్చే ఉత్తరాల మీద విలాసం కనిపిస్తూంది.

రామారావు, సీతాలక్ష్మి తమ ప్రయత్నం విరమించలేదు. కృష్ణమూర్తికి రామయ్య గదిలో ప్రవేశించడం తప్పలేదు.


గది మారాక కృష్ణమూర్తి పరిస్థితి మరీ అధ్వాన్నం అయిపోయింది. అతనికి ఒక్కరాత్రి కూడా నిద్రపట్టలేదు. శరీరంలో ఏదో వ్యాధి కూడా ప్రవేశించినట్టుంది. తనను ఇంత హఠా త్తుగా గది మార్చించవలసిన అవసరం ఏమొ చ్చింది? అనే ప్రశ్న అతన్ని పదే పదే వేధించింది. ఇప్పటికి తన గది విడిచిపెట్టి రెండు మాసాలవు

# రక్తపు మరక

తూంది. ఇంతవరకూ ఆ గది బోడిగానే విడిచి పెట్టారు. అంటే తనను ఆ గదిలోంచి ఈ గది లోకి మార్పించడానికి కేవలం అది ఒక సాకు అన్నమాట! ఆ గదిని తను విడిచిపెట్టడంవల్ల వాళ్ళకు ఒరిగే దేమిటి? అని ఆలోచించ సాగాడు కృష్ణమూర్తి. చివరికి అతడికి ఒక కారణం కని పించింది. అతడి గుండె ఒక్కసారి కొట్టుకోవడం మానేసింది. గడగడ లాడుతూ లేచి మంచంమీద కూర్చొన్నాడు.

తనకు మరణాల గది కేటాయించారు. చచ్చే వాళ్ళంతా ఒకే గదిలో చావడం మంచిదని వాళ్ళు నిర్ణయించుకొని ఉంటారు. అదీకాక, రామా రావు గదిలోనుండి వంటింట్లోకి వెళ్ళాలన్నా, పెరట్లోకి వెళ్ళాలన్నా ఇదివరకు తన గదిలో నుండే వెళ్ళాలి. తను ఆ గదిలో మరణించితే వాళ్ళకు ఇల్లు వాడుకోవడం ఇబ్బందిగా ఉంటుంది.

ఇంతకూ తను ఇప్పుడే మరణిస్తాడని వాళ్ళెలా నిర్ధారణ చేసుకొన్నారు? తన ఆరోగ్యం మునుపటికంటే బాగులేదన్నమాట నిజమే. కాని, ఇంత త్వరలో తాను మరణించే సూచన లేమీ కనుపించలేదు; బలవంతంగా అయితే తప్ప. అదీ సంగతి. తను బల వంతంగా మరణించాలని వాళ్ళు నిశ్చయించు కున్నారు. ఇంట్లో తను కేవలం ఒక అనవసర మైన మనిషై పోయాడు. తాను బతికి ఉన్నంత కాలం వాళ్ళు ఆనందంగా జీవించడానికి తను ఒక ప్రతిబంధకంగానే ఉంటున్నాడు. ఈ అనుమానం కలిగినప్పటినుండీ, కృష్ణమూర్తి కోడలిలో బాహాటంగా వైషమ్యం పెట్టుకొన్నాడు. తన కొడుకు మంచివాడే, ఇదంతా ఆమె ప్రోత్సా హమే అని అతడి నమ్మకం. పైగా ఆమె గర్భ వతి. ఆమె కోర్కెలను తీర్చడానికి అబ్బాయి వెనుకతీయడు.



విసుగు

చిత్రం — సి హెచ్ అప్పలరాజు

(విజయనగరం-1)

* * * *

రామారావు ప్రాక్టీసు ప్రారంభించాడే కాని ఆర్జన ఏమంత బాగాలేదు. ఎప్పటికైనా రోజులు బాగుపడతాయా అనిపించిం దతనికి. ఒక రోజు సీతాలక్ష్మికి తెలియకుండా పెట్టెలోంచి తన జాతకం తీసి జేబులో పెట్టుకొని జ్యోతిష్కుని వద్దకు వెళ్ళాడు. సీతాలక్ష్మికి జాతకాలంటే ఏంతమాత్రమూ నమ్మకములేదు. ఆమె చూస్తే అతనిని తప్పక వారించేదే!

జాతకం చూచిన జ్యోతిష్కుడు చివరకు చెప్పాడు—రామారావు తండ్రి కొద్ది రోజులలో మరణిస్తాడని, ఆ తరువాత అతడి రోజులు బాగు పడుతాయని. రామారావుకు తండ్రి మరణిస్తా డని విచారం, రోజులు బాగుపడుతాయని సంతో షము కలిగాయి.

కోర్టునుండి క్లబ్బుకు వెళ్ళిన రామారావు తిరిగి ఇంటికి రాత్రి ఎనిమిది గంటలకు చేరాడు. అత నింటికి వచ్చేసరికి కృష్ణమూర్తికీ, సీతా లక్ష్మికీ ఏదో ఘర్షణ జరుగుతూంది. రామారావు ఇద్దరినీ ఎలాగో సమాధానపరిచాడు. కృష్ణ మూర్తి తన గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. అతడు బాగా అలిసిపోయాడు. భోజనానికి పిలిచినా లేవ లేదు. ఈలోగా నిద్ర కూడా పట్టింది.

కొంత రాత్రి పోయాక అతడికి తెలివివచ్చింది. సీతాలక్ష్మి, రామారావు, వాళ్ళ గదిలో ఏదో మాట్లాడుకుంటున్నారు. తనమీదే సీతాలక్ష్మి భర్తతో నేరాలు చెప్పుతున్నదని అతనికి అను మానం కలిగింది. ద్వారంవద్ద నిలబడి జాగ్ర త్తగా వినడం ప్రారంభించాడు.

"నేను మా పుట్టింటికి పోతాను. ఇక ఒక క్షణం కూడా మీ తండ్రిని నేను భరించలేను" అంటున్నది సీతాలక్ష్మి.

"కాస్త ఓపిక పట్టు. మా తండ్రి కొద్ది రోజులలోనే మరణించబోతున్నారు. ఆ తరువాత మనకి మంచి రోజులు రాబోతున్నాయి" అన్నాడు రామారావు.

"అంత నిశ్చయంగా ఎలా చెప్పగలుగు తున్నారు?" అని సీతాలక్ష్మి అడిగింది.

బయట నుండి వింటున్న కృష్ణమూర్తికి తల గిర్రున తిరుగుతున్నది. క్రింద పడిపోకుండా ద్వారాన్ని గట్టిగా పట్టుకొని వింటున్నాడు.

"వివరాలన్నీ నీ కనవసరం. నే చెప్పినట్లు జరుగకపోతే అప్పు డడుగు" అన్నాడు రామారావు.

"ఆయన మరణం మన చేతుల్లోనే ఉన్నట్లు మాట్లాడుతున్నారు మీరు" అన్నది సీతాలక్ష్మి.

"అలాగే అనుకో" అన్నాడు రామారావు.

తనకు స్పృహ తప్పిపోతున్నట్లనిపించింది కృష్ణమూర్తికి. కష్టంతో వెళ్ళి మంచంమీద పడుకున్నాడు. ఉదయం ఎన్ని గంటలైనా కృష్ణమూర్తి తన గదిలోనుండి బయటకు రాకపోవడంతో రామారావు వెళ్ళిచూశాడు. కృష్ణమూర్తి తీవ్రమైన జ్వరంతో పడివున్నాడు. ముఖం గాదరించి ఉన్నది. ఎన్నిసార్లు లేపినా లేవలేదు. రామారావు వెంటనే వెళ్ళి డాక్టరుని తీసుకొని వచ్చాడు.

డాక్టరు రోగిని పరీక్షించాడు. "ఈయనకి జ్వరం ఎక్కువగా ఉన్నది. బ్లడ్‌ప్రెషర్ కూడా చాలా తీవ్రంగా ఉన్నది. ఇప్పుడు నేనొక ఇంజక్షను చేస్తాను. రెండు మూడు గంటలలో తెలివి రావచ్చును. మాత్రలు వ్రాసిఇస్తాను. ఈలోగా వాటిని కొనండి. తెలివివచ్చాక వాటిని వాడండి. ఆయనకు పూర్తిగా విశ్రాంతి నివ్వండి. ఏ విధమైన ఉద్రేకమూ పనికిరాదు. లేకపోతే ఎన్ని మందులు వాడినా వ్యర్థం. నేను తిరిగి సాయంత్రం వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు.

రామారావు మాత్రలు తీసుకొనివచ్చాడు. డాక్టరు చెప్పినట్లుగానే కృష్ణమూర్తికి రెండు మూడు గంటలు పోయాక తెలివివచ్చింది.

"ఈ మాత్రలు వేసుకో, నాన్నా!" అన్నాడు రామారావు రెండు మాత్రలు తీసి ఇస్తూ.

కృష్ణమూర్తి మాత్రలు అందుకున్నాడు. వాటిని పరికించి చూచాడు. "నిజం చెప్పు! ఇవి బ్లడ్‌ప్రెషరు మాత్రలు కదూ?" అన్నాడు భయంగా చూస్తూ.

రామారావు తెల్లబోయాడు.

"అవును. మీకు బ్లడ్‌ప్రెషర్ ఎక్కువగా ఉన్నదని, వీటిని వాడమని ఇందాకా డాక్టరుగారు చెప్పారు" అన్నాడు.

"నాకు తెలియకుండా డాక్టరు ఎప్పుడు వచ్చాడు? ఎందుకు, నాయనా, ఈ కపటనాటకం? నేను నీ కంత బరువైపోయానా! నీ తల్లి చనిపోబట్టి ఇంత భోజనంకోసం మీవద్ద ఉండవలసి వచ్చింది. నా పెన్షనంతా మీ చేతికే ఇచ్చేస్తున్నాను. ఇంట్లో ఒక మూల పడి ఉంటున్నాను. నేను మీకేం అపకారం చేశాను? ఎందుకు నాపైన ఇంత పగ?" అన్నాడు కృష్ణమూర్తి దుఃఖంతో.

"మీరేమంటున్నారో నా కర్థం కావటంలేదు. అనవసరంగా ఆవేశపడకండి. మీ దేహానికీ, మీ మనస్సుకూ పూర్తిగా విశ్రాంతి కావాలని డాక్టరు చెప్పాడు. ఈ మాత్రలు వేసుకొని పడుకోండి" అన్నాడు రామారావు.

"అంత అమాయకంగా మాట్లాడకు. ధైర్యం ఉంటే కత్తితో నన్ను పొడిచి చంపు. భ్రష్టుడా! నీ దురుద్దేశం నేను గ్రహించానులే!" అన్నాడు కృష్ణమూర్తి.

"నీ కేమైనా మతిపోయిందా, నాన్నా! నువ్వు నయం కావాలని మందు వెయ్యబోతే నీకు నేను విషం పెట్టుతున్నట్లు మాట్లాడుతావేం? నా మాట విను. అనవసరంగా గొడవ చేయకు. ఈ మాత్రలు వేసుకో" అన్నాడు రామారావు.

"ఛీ! దౌర్భాగ్యుడా! అవతలికి పో!" అని గట్టిగా అరిచాడు కృష్ణమూర్తి.

రామారావుకు ఏమి చేయడానికీ తోచలేదు. కృష్ణమూర్తి పరిస్థితి చూస్తుంటే విషమిస్తోంది. ఆయాసం ఎక్కువైంది. ఆహారం కూడా తీసుకోవడం మానేశాడు. పరాకుగా మాట్లాడటం ప్రారంభించాడు. రామారావుకు ఆత్రుత ఎక్కువైంది. దగ్గరగా ఉన్న ఒకరింటికి వెళ్ళి డాక్టరుకు ఫోన్ చేశాడు. కంగారు పడవద్దని, సాయంత్రం తను వస్తానని డాక్టరు చెప్పాడు. చివరకు సాయంత్రమైంది. డాక్టరు వచ్చాడు. జరిగినదంతా రామారావు అతడితో చెప్పాడు.

"ఈ మాత్రలు వాడమని నేనే చెప్పాను. మీ రేదో దురభిప్రాయపడుతున్నారు. మీకంత అనుమానంగా ఉంటే ఆ మాత్రలు నా చేత్తోటే ఇస్తాను, వేసుకోండి" అని కృష్ణమూర్తితో డాక్టరు చెప్పాడు.

"మీరు మహానుభావులు. మీరు దేనికైనా సమర్థులు. డాక్టర్ వార్ ఎవరు? మీలో వాడే కదూ? మీ చేత్తో విషం వేసినా ఔషధం ఇచ్చారనే లోకం భావిస్తుంది. నే నెందుకూ పనికి రానివాణ్ణి. మూల చేరినవాణ్ణి. మానాడంటే పైకి వస్తున్న స్నేడరు. మీ వ్యవహారాలు ఈ మధ్య వాడే చూస్తున్నాడు కదూ? మీకో నమస్కారము" అన్నాడు కృష్ణమూర్తి.


డాక్టరు చరచరా గదిలోనుండి బయటకు వచ్చాడు. ఆయన ముఖం పాలిపోయింది.

"మీ తండ్రిగారు నన్ను కూడా అనుమానిస్తున్నారు. ఇక ఆయనకు వైద్యం చేయడం నావల్ల కాదు. నేను వెళ్తున్నాను" అని తనవెంట వచ్చిన రామారావుతో చెప్పాడు.

"ఈ ఆపద సమయంలో మీరు కూడా తప్పుకుంటే ఎలాగ? వారు జ్వర తీవ్రతలో ఏదో అన్నారు. మీరు దాన్ని పట్టించుకోకండి. ఇప్పుడు ఏమిటి చేయడమో చెప్పండి" అన్నాడు రామారావు ప్రాధేయపడుతూ.

"ఆయనకి మనం ఇప్పుడేమీ చేయలేము. అంబులెన్స్ వాన్‌కి ఫోన్ చేయండి. పెద్దాసుపత్రిలో చేర్పించండి. అక్కడ బలవంతంగానైనా వాళ్ళు ఇంత ఆహారం ఎక్కిస్తారు" అని చెప్పి డాక్టరు వెళ్ళిపోయాడు.

రామారావు వెళ్ళి టెలిఫోన్ చేశాడు. తిరిగి వచ్చేసరికి సీతాలక్ష్మి అరుగుమీద నిలబడి ఉన్నది.



సారంగి వాదన

చిత్రం—ప్రేమ్ చంద్ర గోస్వామి (జైపూర్)

"ఎలాగున్నది?" అంటూ రామారావు పెద్దక్కాడు.

"ఆయనకు పూర్తిగా స్పృహ తప్పిపోయింది. బట్టలు చింపుకొంటున్నారు. ఇంటిని ఏదో భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. అందుకే అరుగుమీద నిలబడ్డాను" అని సీతాలక్ష్మి చెప్పింది.

రామారావు తండ్రి గదిలోకి వెళ్ళాడు. పరిస్థితి సీతాలక్ష్మి చెప్పినట్లుగానే ఉన్నది. తండ్రి ముఖం చూస్తూ రామారావు కూర్చున్నాడు. కొంతసేపటికి బయట వాను ఆగిన శబ్దం వినిపించింది. స్ట్రెచర్ పట్టుకొని ఇద్దరు మనుష్యులు లోనికి వచ్చారు. అదే సమయానికి కృష్ణమూర్తికి తెలివివచ్చింది.

"నేను వెళ్ళిపోతున్నాను లే, బాబూ! నువ్వు నాకంటే అదృష్టవంతుడివి. నీ చేతులు పాపపంకిలం కాలేదు. నువ్వు నాకన్నా ఘటికుడివే! బ్లడ్‌ప్రెషర్‌తో బాధపడుతున్న నీ తల్లికోసం తెచ్చిన మాత్రలు, వార్ధక్యంలో స్వల్పమైన జ్వరంతో బాధ పడుతున్న మా తండ్రికి వేసి నేను చంపాను. కాని, నువ్వో? ఆ మాత్రలు నాకు చూపించే నా ప్రాణం తీయబోతున్నావు. నీ వెనుక నిలబడ్డవారెవరు? యమదూతల్లాగున్నారే! చూస్తుంటే వాళ్ళు నల్లగా మారిపోతున్నారే! ఈ అంధకారం ఏమిటి? ఈ అంధకారంలో ఆ నల్లటి రూపాలు నాకు ఎలా కనిపిస్తున్నాయి? నేను వెళుతున్నాను, రామా" అంటూ బిగ్గరగా కేకవేసి కృష్ణమూర్తి ప్రాణం వదిలిపెట్టాడు.

'ఎంత పని చేశావు, నాన్నా! ఇంతవరకూ నాకు తెలియనివ్వలేదే? నీ భయాలకూ, నీ అనుమానాలకూ అదా కారణం! కాని, అందరూ నీవంటివారే ఉంటారా, నాన్నా' అనుకున్నాడు రామారావు కళ్ళు తుడుచుకుంటూ. ★